క్లుప్తంగా

విజేతగా కుకుడ క్రికెట్ జట్టు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంపీపీ నానయ్య

చింతలమానెపల్లి: మండలంలోని ఖర్జెల్లి గ్రామంలో శివాజీ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలు గురువారం ముగిశాయి. ఫైనల్‌లో కుకుడ, ఖర్జెల్లి జట్లు తలపడగా విజేతగా కుకుడ జట్టు నిలిచింది. ద్వితీయ స్థానంలో ఖర్జెల్లి నిలిచింది. విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.30 వేల నగదు, ద్వితీయ బహుమతి రూ. 20వేల నగదుతో పాటు జ్ఞాపికలను ఎంపీపీ అందజేశారు. కాగజ్‌నగర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ డోకె రాజన్న, సర్పంచ్ చౌదరి నానయ్య, నాయకులు టోంబ్రె శ్రీనివాస్, రంగన్న, నారాయణ పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి



పోటీలు ప్రారంభిస్తున్న ఎస్సై ప్రవీణ్‌కుమార్

కౌటాల: గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలని ఎస్సై ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని ముత్తంపేట గ్రామంలో మహాత్మా జ్యోతిబాపూలే మండల స్థాయి వాలీబాల్ పోటీలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందన్నారు. యువకులు చెడు వ్యాసనాలకు దూరంగా ఉండాలన్నారు. సర్పంచ్ ఆదే శ్రీనివాస్, మాలి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదే వసంత్‌రావు, ఉప సర్పంచ్ దుర్గం వెంకటేశ్, నాయకులు నాందేవ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదవాలి



మాట్లాడుతున్న ఎస్సై సోనియా

కాగజ్‌నగర్‌రూరల్: క్రమశిక్షణ జీవతానికి ఎంతో అవసరమని కాగజ్‌నగర్‌రూరల్ ఎస్సై సోనియా అన్నారు. మండల భట్‌పల్లి జెడ్పీ సెకండరీ పాఠశాలలో పదో విద్యార్థులకు మోటివేషన్ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కష్టపడి చదివి ప్రయోజకులు కావాలన్నారు. విద్యార్థులకు సెల్‌ఫోన్‌లకు బానిసకావద్దని సూచించారు. హెచ్‌ఎం నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

యంత్రాల నిర్వహణ సరిగా ఉండాలి

శ్రీరాంపూర్: ఓసీపీల్లో వినియోగించే భారీ యంత్రాల నిర్వహణ సరిగ్గా ఉంటేనే వాటి జీవితకాలం ఎలాంటి బ్రేక్‌డౌన్లు లేకుండా పనిచేస్తాయని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి తెలిపారు. కార్పొరేట్ మిషన్ మెయింటనెన్సు ఆడిట్ టీం గురువారం శ్రీరాంపూర్ ఓసీపీని తనిఖీ చేసింది. ముందుగా పీవో ఆఫీసులో అధికారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమానికి శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి హాజరై ఆడిట్ టీంతో చర్చించారు. యంత్రాల పనితీరు మరింత మెరుగుపర్చుకోవాలని ఆయన సూచించారు. కార్పొరేట్ డీజీఎం సోమయాజులు, ఎస్‌ఈ గాబ్రియల్‌రాజు, ఈఈ రాజులతో కూడిన టీం తనిఖీ చేసింది. కార్యక్రమంలో ఓసీపీ పీవో పురుషోత్తంరెడ్డి, మేనేజర్ సుధీర్ జక్కులవార్, ఇంజనీర్ చంద్రశేఖర్, రక్షణాధికారి వీరయ్య పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కౌటాల/దహెగాం: కౌటాల, దహెగాం మండలాల్లోని గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ రవీందర్ తెలిపారు. ఈజ్‌గాంలోని 132 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు కారణంగా సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించాలని కోరారు.

ఉచిత వైద్యశిబిరం

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని బారెగూడ గ్రామంలో స్పర్శ సోషల్ ఫౌండేషన్ (ఎస్పీఎం) ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ప్రజల ఆరోగ్య సమస్యలను తెలుసుకుని ఉచితంగా మందులను పంపిణీ చేశారు. వైద్యులు భానుప్రకాశ్, యూనిట్ హెడ్ ఏకే మిశ్రా, హెచ్‌ఆర్ జీఎం గిరి, నాగరాజు, సర్పంచ్ సంతర్ పాల్గొన్నారు.

కూలీలు ఆధార్‌కార్డు జిరాక్స్‌లు అందించాలి

కౌటాల: కౌటాల పంచాయతీ కార్యాలయంలో ఉపాధి కూలీలు తమ ఆధార్‌కార్డులను శుక్రవారం సమర్పించాలని కార్యదర్శి సాయికృష్ణ గురువారం తెలిపారు. ఉపాధి కూలీలు తమ జాబ్‌కార్డు, బ్యాంక్ ఖాతా జిరాక్స్ పత్రాలను అందించాలని పేర్కొన్నారు. ప్రతి కూలీ ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. లేకపోతే పని చేసిన కూలి డబ్బులు చెల్లించరని పేర్కొన్నారు.

'కంటి వెలుగు' సద్వినియోగం చేసుకోవాలి



చింతలమానెపల్లి: శిబిరంలో అధికారులు



కంటి వెలుగు వైద్యపరీక్షలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్

- సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

కాగజ్‌నగర్‌రూరల్: కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప కోరారు. మండలంలోని భట్‌పల్లి పీహెచ్‌సీలో రెండోవిడత కంటి వెలుగు కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల వైద్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపించిందన్నారు. గ్రామాల పరిధిలోని ప్రజలు కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈజ్‌గాం పీహెచ్‌సీలో కంటి వెలుగు కార్యక్రమాన్ని జిల్లా పరిషత్ ఉపాధ్యక్షుడు కోనేరు కృష్ణారావు ప్రారంభించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ కాసం శ్రీనివాస్, ఎంపీపీ చీపురుశెట్టి శంకర్, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు స్వదేశ్‌శర్మ, వ్యవసాయ శాఖ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పోచయ్య, సర్పంచ్ ఉమా, ఉపసర్పంచ్ భాస్కర్ల శ్రీనివాస్, పాల్గొన్నారు.

సిర్పూర్(టి): ప్రభుత్వం నిర్వహిస్తున్న కంటి వెలుగు పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ కోరారు. మండలకేంద్రంలోని రైతువేదికలో కంటి వెలుగు కార్యక్రమాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ప్రతి గ్రామం నుంచి అర్హులైన వారందరు కంటి వైద్యపరీక్షలు నిర్వహించుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం 35 రోజులు పకడ్బందీగా చేపట్టాలని అధికారులకు సూచించారు. దీనికి ముందు ఎంపీపీ సువర్ణ, సిర్పూర్(టి) సర్పంచ్ తఫీమా పర్వీన్‌లు కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కోఆప్షన్ సభ్యుడు కిజర్‌హుస్సేన్, తహసీల్దార్ జమీర్‌హుస్సేన్, ఎంపీడీవో రాజేశ్వర్, ఎంపీవో మహేందర్, కంటి వెలుగు ప్రత్యేక అధికారి వెంటకేశం, మండల ఇన్‌చార్జి డాక్టర్ నవత, ఈవో కృష్ణమూర్తి, నాయకులు ఇఫాత్‌హుస్సేన్, ఆశిక్‌హుస్సేన్, హెల్త్ సూపర్‌వైజర్ రాజలింగు పాల్గొన్నారు.

చింతలమానెపల్లి: రవీంద్రనగర్–1లో జెడ్పీ ఉన్నత పాఠశాలలో కంటివెలుగు శిబిరాన్ని ఎంపీపీ నానయ్య, జెడ్పీటీసీ శ్రీదేవి ప్రారంభించారు. తొలిరోజు 128 మందికి పరీక్షలు నిర్వహించారు. లోపాలు ఉన్నవారికి మందులు, కళ్లద్దాలను అందజేశారు. ఎంపీడీవో మహేందర్, మండల ఉపాధ్యక్షుడు మనోజిత్ మండల్, సర్పంచ్ రీనా సర్దార్, కోఆప్షన్ సభ్యులు నాజిం హుస్సేన్, వైద్యాధికారి అజీముద్దీన్, కంటివెలుగు శిబిరం అధికారి అజ్మీర రాజ్‌కుమార్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెంకన్న, నాయకులు సుధాకర్ ఉన్నారు.

బెజ్జూర్: మండల కేంద్రంలోని రైతు వేదిక ఆవరణలో కంటి వెలుగు కార్యక్రమాన్ని జెడ్పీటీసీ పంద్రం పుష్పాలత ప్రారంభించారు. కోఆప్షన్ సభ్యుడు బషారత్ ఖాన్, సహకార సంఘం మాజీ చైర్మన్ డోకె వెంకన్న, బెజ్జూర్ సర్పంచ్ కొట్రాంగి శారద, ఉప సర్పంచ్ అడ్డూరి రాజేష్, ఎంపీటీసీలు పర్వీన్ సుల్తానా, గురజాల వెంకటేశం, మాజీ సర్పంచ్ సుగుణ, వార్డు సభ్యులు లలిత, బీఆర్‌ఎస్ నాయకులు జావిద్, అజీమ్ ఖాన్, రమేశ్, భీమన్న, భిక్షయ్య పాల్గొన్నారు.

నార్నూర్(జైనూర్): అంధత్వ నివారణ కోసం సీఎం కేసీఆర్ కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యదవ్‌రావు, సిర్పూర్(యూ) జెడ్పీటీసీ కోవ అరుణ తెలిపారు. జైనూర్‌లోని సీహెచ్‌సీలో ఎంపీపీ తిరుమలతో కలిసి కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. సర్పంచ్ మెస్రం పార్వతిబాయి, ఎంపీడీవో ప్రభుదాయ, ఏఐ మధుకర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఇంతియాజ్‌లాల, వైద్యులు నాగేందర్, అశోక్, జీతేందర్, పంచాయతీ ఈవో శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

పెంచికల్‌పేట్: పెంచికల్‌పేట్ పంచాయతీలో కంటి వెలుగు శిబిరాన్ని జెడ్పీటీసీ సరిత ప్రారంభించారు. ఎంపీడీవో గంగాసింగ్, సర్పంచులు మేకల కమల, పాలె సుధాకర్, పెంచికల్‌పేట్ వైద్యాధికారి నేహా, కంటి వెలుగు క్యాంప్ వైద్యాధికారి సురేందర్, ఎస్సై విజయ్‌కుమార్, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

దహెగాం: మండల కేంద్రంలో రైతు వేదికలో కంటి వెలుగు శిబిరాన్ని జెడ్పీటీసీ తాళ్లపల్లి రామారావు ప్రారంభించారు. తొలిరోజు 150 మందికి పరీక్షలు నిర్వహించి అందులో 32 మందికి కళ్లద్దాలు అందజేశారు. మరో 46కు ఆర్డర్ పెట్టినట్లు వైద్యాధికారి మల్లికార్జున్ తెలిపారు. రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ సంతోష్‌గౌడ్, ఎంపీడీవో రాజేశ్వర్ గౌడ్, సర్పంచ్ పుప్పాల లక్ష్మి, ఎస్సై సనత్‌కుమార్, కార్యదర్శి ప్రనీత్‌బాబు, హెల్త్ అసిస్టెంట్ ఓదెలు పాల్గొన్నారు.

కౌటాల: కౌటాల పంచాయతీ కార్యాలయంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ఎంపీపీ విశ్వనాథ్ ప్రారంభించారు. డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మాంతయ్య, కౌటాల సీఐ స్వామి, ఎస్సై ప్రవీణ్‌కుమార్, ఎంపీడీఓ నస్రుల్లాఖాన్, ఎంపీఓ సుధాకర్‌రెడ్డి, సర్పంచ్ మౌనిశ్, ఉప సర్పంచ్ తిరుపతి, కార్యదర్శి సాయికృష్ణ పాల్గొన్నారు.

వాంకిడి: స్థానిక పంచాయతీ కేంద్రంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ఎంపీపీ విమలబాయి, జెడ్పీటీసీ అజయ్‌కుమార్ ప్రారంభించారు. సర్పంచ్ తుకారాం, జిల్లా పంచాయతీ అధికారి రమేశ్, ఎంపీడీవో వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కాగజ్‌నగర్‌రూరల్: ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోనప్ప



జైనూర్‌లో ప్రారంభిస్తున్న యాదవ్‌రావు, అరుణ



బెజ్జూర్: శిబిరాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ



దహెగాంలో..



పెంచికల్‌పేట్: పరీక్షలు చేసుకుంటున్న జెడ్పీటీసీ సరిత

ఐదు దశల్లో 'కంటి వెలుగు'



వివరాలు నమోదు చేసుకుంటున్న సిబ్బంది



చార్ట్ ద్వారా కంటి చూపు పరిశీలన

- దృష్టిలోపాలు ఉన్నవారికి కళ్లద్దాలు
- వైద్యాధికారుల పర్యవేక్షణ
- ఉచితంగా శిబిరాలు

చింతలమానెపల్లి: ప్రభుత్వం ప్రజల కంటి ఆరోగ్యానికి తీసుకుంటున్న చర్యల్లో భాగంగా కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. ఆయా పీహెచ్‌సీల పరిధిలో ఉచిత కంటి వెలుగు శిబిరాలు ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించి కంటి చూపు, దృష్టి లోపాలు ఉన్నవారికి కళ్లద్దాలు, మందులను ఉచితంగా పంపిణీ చేస్తోంది. దీనికోసం ఒక్కో శిబిరంలో వైద్యాధికారి, వైద్య నిపుణుడు, వైద్య, డాటా నమోదు సిబ్బంది, ఏఎన్‌ఎం, ఆశవర్కర్లను నియమించింది.

నమోదు

ఆయా గ్రామాల్లోని కంటి వెలుగు శిబిరాల్లో గ్రామస్తుల ఆధార్‌కార్డు ఆధారంగా వివరాలు నమోదు చేసుకుంటారు. కంటి వెలుగుకు సంబంధిత వ్యక్తి వివరాలను రిజిస్టర్ చేస్తారు. ఈ నమోదుకు వ్యక్తి ఆధార్ కార్డు, ఓటర్ ఐడీ, ఇతర ప్రభుత్వ గుర్తింపు కార్డు తప్పనిసరి.

కంటి చూపు పరిశీలన

వ్యక్తి వివరాలు నమోదు చేసుకున్న అనంతరం కంటి పరిశీలనలో భాగంగా మొదటి దశలో 3 మీటర్ల దూరంలోని చార్ట్‌పై అక్షరాలు చూపించి గుర్తించమంటారు. అక్షరాలు గుర్తించే సామర్థ్యాన్ని ఆధారంగా కంటి చూపు పరిస్థితిని అంచనా వేస్తారు. దూర దృష్టి, దగ్గర దృష్టిలో లోపాలను గుర్తిస్తారు.

వైద్యాధికారి పరిశీలన

కంటి చూపు లోపాలను గుర్తించి అనంతరం పరీక్ష నిర్వహిస్తారు. టార్చ్‌లైట్ ద్వారా కంటి ముందు భాగం పరిశీలన నిర్వహిస్తారు. రెటీనా, శుక్లాలను గుర్తించి అనుగుణంగా చికిత్సకు సిఫార్సు చేస్తారు.



కంటి ముందు భాగం పరిశీలిస్తున్న వైద్యాధికారి



యంత్రం ద్వారా పరిశీలిస్తున్న నిపుణుడు

యంత్రాల ద్వారా పరీక్ష

కంటి పరిశీలనలో కీలక దశ పరిశీలన యంత్రాల ద్వారా నిర్వహిస్తారు. వైద్యాధికారి కంటి పూర్తి స్థితిని తెలుసుకునేందుకు కంటి పరీక్ష నిపుణుడి సహాయంతో అబ్జెక్టివ్ రిఫ్రాక్షన్ అనే పరీక్ష నిర్వహిస్తారు. కటకాల ద్వారా కంటి చూపు స్థితిని పరీక్షిస్తారు. 6 మీటర్ల దూరంలోని చిహ్నాలను గుర్తించడం ద్వారా కంటి స్థితిపై పూర్తి అంచనాకు వస్తారు.

కళ్లద్దాలు, మందులు పంపిణీ

పై పరీక్షల అనంతరం వైద్యాధికారి ధ్రువీకరణతో సిఫార్సు చేయబడిన మందులు, కళ్లద్దాలను ఆ వ్యక్తికి అందజేస్తారు. అతడి వివరాలు, అందించిన చికిత్సను చివరగా నమోదు చేస్తారు.

ఉద్యోగుల రక్షణకు అధిక ప్రాధాన్యత



అవగాహన కల్పిస్తున్న సేఫ్టీ జీఎం జాన్ ఆనంద్

రెబ్బెన(ఆసిఫాబాద్): విధి నిర్వహణలో భాగంగా రక్షణ విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యానికి తావివ్వొద్దని బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం జాన్ ఆనంద్ సూచించారు. బెల్లంపల్లి ఏరియాలోని కై రిగూడ ఓసీపీలో ఉద్యోగులకు సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్ అమలుపై గురువారం అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ సింగరేణి సంస్థ ఉద్యోగుల రక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రక్షణపై ఉద్యోగులకు అవగాహన కల్పించాలన్నారు. రక్షణ పరికరాలను పూర్తిస్థాయిలో వినియోగించుకుని ప్రతి ఒక్కరూ రక్షణసూత్రాలు పాటించాలన్నారు. సింగరేణిని ప్రమాదాల రహిత సింగరేణిగా తీర్చిదిద్దాలని సూచించారు. ఎస్‌వోటూజీఎం కేహెచ్‌ఎస్ గుప్తా, ఏజీఎం తిరుమల్‌రావు, పీవో ఉమాకాంత్, సేఫ్టీ అధికారి రాజేశ్వర్‌రావు, ఇన్‌చార్జి ప్రాజెక్టు ఇంజినీర్ నరేశ్, సీనియర్ పీవో వేణు తదితరులు పాల్గొన్నారు.

మిర్చి రైతు విలవిల



గుండాయిపేటలో ఎండిపోయిన మిర్చి పంట

- పంటలకు సోకిన విల్ట్
- ఎండిపోతున్న మొక్కలు
- ఆందోళనలో రైతులు



ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు పి.మొండి. తాటిపల్లి గ్రామం. తన మూడెకరాల్లో మిర్చి పంట చేశాడు. సాగుకు ఇప్పటి వరకు రూ. 2 లక్షల వరకు పెట్టుబడి పెట్టాడు. మరో నెల రోజుల్లో పంట చేతికి వస్తుందనుకుంటే ఎండుతెగులు(విల్ట్) సోకి ఎండిపోతుంది. పంటకు ఎలాంటి మందులు పిచికారీ చేసిన ఫలితం లేదు. సాగుకు చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియడం లేదు.

కౌటాల: వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులు మిరప పంటలు దెబ్బతింటున్నాయి. పంటకు తెగుళ్లు ఆశిస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది జిల్లాలో వర్షాలు బాగా కురిశాయి. ఆనందంతో జిల్లా వ్యాప్తంగా 4 వేల ఎకరాల్లో సాగు చేశారు. ఖరీఫ్ ఆఖరిలో కురిసిన భారీ వర్షాలకు తేమ ఎక్కువై పంటలకు విల్ట్ తెగులు ఆశించింది. కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్ మండలాలతోపాటు గ్రామాల్లో వందల ఎకరాల పంటకు ఈ తెగులు వ్యాపించి పంట ఎండిపోతుంది.

దిగుబడి వస్తుందని ఆశిస్తే..

మిర్చి పంటకు మార్కెట్‌లో మంచి ధర ఉంది. ఈసారి అధిక లాభాలు వస్తాయని ఆశించిన రైతులు మిర్చి చేశారు. కాని ఏపుగా పెరుగుతున్న మిరప మొక్కలకు విల్ట్ తెగులు సోకింది. దీనికి తోడు ఆకుమచ్చ అధికంగా ఉంది. 20 రోజుల్లో వందల ఎకరాల్లో పంట ఎండిపోయింది. ఎన్ని మందులు పిచికారీ చేసినా ప్రయోజనం కనిపించడం లేదని రైతులు వాపోతున్నారు. చేసేదేమి లేక పంటలను తొలగిస్తున్నారు. సాగు చేసిన వారిలో ఎక్కువ మంది కౌలు రైతులే. ఎకరా మిర్చి సాగుకు దుక్కి దున్నడం మొదలుకొని ఎరువులు, విత్తనాలు వేసే నాటికి రూ.70 వేల ఖర్చు వస్తుంది. కౌలు రైతులకు ఎకరాకు రూ. 10 వేలు అదనం. విల్ట్ తెగులుతో నష్టపోయామని వాపోయారు.

పంటలకు సోకిన వైరస్

ప్రకృతి వైపరీత్యాలతో అన్నదాతలు ఏటా నష్టపోవాల్సి వస్తుంది. ఈ ఏడాది అధిక వర్షాలతో దిగుబడి తగ్గిపోయి రైతులు నష్టాలను చవి చూడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. తేమ ఎక్కువ ఉన్నప్పుడు ఫుసేరియం రోగ కణాల దాడి వల్ల వేర్లు కుళ్లిపోయి మొక్కలు ఎండిపోతాయి. ఆ కుళ్లిపోయిన వేరులు నల్లటి రంగులో కనిపిస్తాయి. ఈ వ్యాధిని ఫుసేరియం విల్ట్ అని పిలుస్తారు. లక్షణాలు ఇలా కనిపిస్తే పంటకు ఆరంభంలో తెగులు నివారణకు కాపర్ ఆక్సిక్లోరైడ్ లీటర్‌కి 3 గ్రాములు, స్ట్రెప్టోమైసిన్ సల్ఫేట్‌ను ఎకరాకు 30 గ్రాముల పంటలకు పిచికారీ చేయాలని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు.

ఎండిన పంట

మిర్చి వేసి సుమారు 90 రోజులు కావస్తోంది. ఇంకో 30 రోజుల్లో పంట చేతికందే సమయంలో వేరుకుళ్లు తెగులతో విల్ట్ వైరస్ కారణంగా ఎండిపోతుంది. ఏం చేయాలో తెలియని స్థితిలో రైతులు ఉన్నారు. హార్టికల్చర్ శాఖ అధికారులు మండల స్థాయిలో లేకపోవడంతో రైతులకు సరైన సూచనలు, సలహాలు ఇచ్చే దిక్కులేదు. అధిక పెట్టుబడితో సాగుచేసే మిర్చి నష్టపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

ఉచిత శిక్షణతో ఉజ్వల భవిష్యత్

- ప్రభుత్వ కళాశాలల్లో ఎంసెట్ శిక్షణ
- ఇంటర్ సెకండియర్ సైన్స్ విద్యార్థులకు అవకాశం
- ప్రతిభ పరీక్షల్లో అర్హత తప్పనిసరి
- జిల్లా నుంచి బాలురు 50, బాలికలు 50 మంది ఎంపిక



విద్యార్థులకు బోధిస్తున్న అధ్యాపకులు

ఆసిఫాబాద్‌రూరల్: ప్రైవేట్ కాలేజీలు కోచింగ్ సెంటర్లలో అధిక ఫీజులు వసూళ్లు చేసి నీట్, ఎంసెట్‌కు శిక్షణ ఇస్తుండడంతో విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధిస్తున్నారు. ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థులు మాత్రం రాణించలేకపోతున్నారు. ఇది గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం..ఇంటర్ సెకండియర్ సైన్స్ విద్యార్థులు ఉన్నత విద్యనభ్యసించేలా ప్రోత్సాహం అందిస్తోంది. జాతీయస్థాయి ప్రవేశపరీక్ష (నీట్) కోసం వారికి ఉచితంగా ఎంసెట్ కోచింగ్ ఇచ్చేందుకు శ్రీకారం చుట్టింది. ఇందుకోసం జిల్లాలో ఇప్పటికే అధ్యాపకులకు శిక్షణ సైతం ఇచ్చింది. ప్రతిభ ఉండి ఆర్థిక స్థోమత లేక కోచింగ్ తీసుకోలేని వారికి నీట్ కోచింగ్ అందించి డాక్టర్లు, ఇంజినీర్లుగా రాణించేలా శిక్షణ కల్పిస్తోంది.

రెండు నెలలు శిక్షణ

జిల్లాలోని 11 ప్రభుత్వ కళాశాలుండగా అందులో 5,386 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఇంటర్ సెకండియర్ విద్యార్థులు 2400, ఫస్టియర్ విద్యార్థులు 2986 మంది ఉన్నారు. ఇందులో ద్వితీయ సంవత్సరం సైన్స్ విద్యార్థులు 1064 మంది ఉన్నారు. వీరికి పరీక్ష నిర్వహించి ప్రతిభ కనబర్చిన 50 మంది బాలురు, 50 మంది బాలికలకు ఎంపిక చేసి రెండునెలల పాటు ఉచితంగా ఎంసెట్ శిక్షణ అందిస్తారు. రోజువారీగా శిక్షణలో భాగంగా సైన్స్, మ్యాథ్స్ తదితర సబ్జెక్టుల్లో వివిధ అంశాలపై అధ్యాపకులు బోధిస్తున్నారు. ప్రతిరోజు తరగతుల అనంతరం సబ్జెక్టులపై అదనంగా గంట సమయం కేటాయించి వారికి శిక్షణ అందిస్తూ ప్రవేశ పరీక్షకు సన్నద్ధం చేస్తున్నారు.

బాలురు, బాలికలకు వేర్వేరుగా శిక్షణ

అర్హత పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన 50 మంది బాలికలు, 50 మంది బాలురను ఎంపిక చేస్తారు. ఎంపికైన వారిని జిల్లా కేంద్రంలో గిరిజన సంక్షేమ గురుకుల (పీటీజీ) బాలుర పాఠశాలలో బాలురు, గిరిజన బాలికల పాఠశాలలో బాలికలకు హాస్టల్‌తోపాటు శిక్షణ అందించనున్నారు. శిక్షణ పూర్తయ్యేవరకు పుస్తకాలు, వసతితోపాటు అల్పాహారం, మధ్యాహ్నం రాత్రి, భోజనం అందిస్తారు. నిపుణుల పర్యవేక్షణలో సీనియర్ అధ్యాపకులతో బోధిస్తారు. అన్ని అంశాలపై పట్టు సాధించేలా స్టడీ అవర్స్, వారికి పాఠాల్లో సందేహాలను నివృత్తి చేస్తారు.

కళాశాలలో ప్రత్యేక తరగతులు



కళాశాలలో ప్రతిరోజు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. పరీక్షలో అర్హత సాధించేలా శిక్షణ ఇస్తున్నాం.

– సువర్ణిని, సత్యవతి, ఆసిఫాబాద్ కళాశాల

అర్హత పరీక్షకు సిద్ధమవుతున్నా



ఎంసెట్ అర్హత పరీక్షకు అధ్యాపకులు ప్రత్యేక తరగతులు నిర్వహించి అందరినీ సన్నద్ధం చేస్తున్నారు. వారు ఇచ్చే సలహాలు సూచనలతో పరీక్షకు సిద్ధమవుతున్నా.

– సువాసిని, ప్రభుత్వ పాఠశాల

విద్యార్థులకు మంచి అవకాశం



ప్రభుత్వ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు మంచి అవకాశం. ప్రతిభ పరీక్ష నిర్వహించి అర్హత సాధించిన వారికి రెండు నెలలపాటు శిక్షణ అందిస్తాం. – శ్రీధర్ సుమన్, డీఐఈవో

గడప గడపకూ 'కాంగ్రెస్'



ఊరు మందమర్రిలో ముసలమ్మతో ముచ్చటిస్తున్న జిల్లా అధ్యక్షురాలు సురేఖ

మందమర్రిరూరల్: చెన్నూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ కోరారు. మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని ఊరు మందమర్రిలో గురువారం 'గడప గడపకూ కాంగ్రెస్' కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. ఇంటింటికీ తిరిగి ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని అభ్యర్థించారు. ఆమె వెంట పీసీసీ మెంబర్స్ నూకల రమేష్, ఎండీ ముజాయిద్, నాయకులు సత్యనారాయణ, ఉపేందర్, హఫీజ్ ఉర్ రహమాన్, లక్ష్మణ్, జీవన్‌కుమార్, నర్సోజీ, శ్రీనివాస్, రజిత తదితరులు ఉన్నారు.